క్లుప్తంగా

వర్షం కోసం గ్రామదేవతకు సంబరం



గ్రామదేవత గంగాభవాని సంబరాన్ని నిర్వహిస్తున్న అనంతపల్లి గ్రామపెద్దలు

నల్లజర్ల: విస్తారంగా వర్షాలు కురవాలి.. సమృద్ధిగా పంటలు పండాలని అనంతపల్లి గ్రామదేవత దండు గంగాభవానీని ప్రార్థిస్తూ బుధవారం ఆ గ్రామపెద్దలు సంబరం నిర్వహించారు. ఏటా ఆషాఢంలో అమ్మవారికి చలిమోరు (అన్నం, పెరుగు) నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం ఆ నైవేద్యాన్ని రైతులు ప్రసాదంగా స్వీకరిస్తారు.డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి చలిమారు (పెరుగు, అన్నం), చలివిడి, పానకాలు సమర్పించారు. ఈ వేడుకలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, కలం సత్యనారాయణ, బళ్ల నాని, ప్రత్తి శ్రీనుబాబు, బోయపాటి సుబ్బారావు, మద్దిపాటి నరసింహారావుతో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కారంచేడు మృతులకు కేఎన్‌పీఎస్ నివాళి



కారంచేడు దళిత మృతవీరులకు నివాళి అర్పిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు

నిడదవోలు రూరల్: దళితులపై అగ్రకుల, ఉన్మాదుల దాడులను ప్రతిఘటిద్దామని కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు కోరారు. కారంచేడు దళిత మృతవీరుల వర్ధంతి సందర్భంగా బుధవారం కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో సమిశ్రగూడెంలో జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్‌రాజ్ అధ్యక్షతన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ పిడికెడు ఆత్మగౌరవం కోసం, భూమి కోసం, భుక్తి కోసం పరితపిస్తున్న దళితులపై, గిరిజనులపై అగ్రకుల ఉన్మాదుల దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు దిద్దే రాజు, కొల్లి కిషోర్, సిర్రా సిద్ధార్థ, కూనపో చందు, రాజు, రమేష్, వెంకట్రావు, కిషోర్‌లు పాల్గొన్నారు.

రామాలయం అభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలోని రాయిపేటలోని కోదండ రామాలయం అభివృద్ధికి ప్రవాస భారతీయుడు (ఎన్ఆర్ఐ) కూనిశెట్టి మధుమూర్తి, విద్య దంపతులు రూ.50 వేలు విరాళంగా పంపించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదుగా ఈ నగదును బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొల్లేపర వెంకట రత్నకుమార్, కార్యదర్శి అనంతపల్లి కృష్ణచైతన్య, గొన్నాబత్తుల రామారావు, కామిశెట్టి సత్యనారాయణ, మడిపల్లి భాస్కరం, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నీలం రామారావు పాల్గొన్నారు.

జీవోలున్నా తొలగని రజకుల సమస్యలు

తాళ్లపూడి: రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు జారీ చేస్తున్న జీవోలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య పేర్కొన్నారు. బుధవారం తాళ్లపూడి వచ్చిన కట్లయ్య స్థానిక రజకులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలోనూ రజకులకు వృత్తిపరమైన చెరువులు కేటాయించి, ధోబీఖానాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనేక గ్రామాల రజకుల తమ న్యాయమైన హక్కులను పొందలేక పోతున్నారన్నారు. గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి రజకుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 62 ప్రకారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీని నియమించి, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆ కమిటీ సమావేశం నిర్వహించి, రజకుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు దోసపల్లి సత్యనారాయణ, గంగలగుర్తి మంగరాజు, సాయిరాం, దోసపల్లి సత్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో రజకుల చెరువు పరిశీలన

కొవ్వూరు: రజకుల చెరువుల ఫలసాయం విషయంలో ప్రభుత్వ జీవోల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. మండలంలోని వాడపల్లి గ్రామంలో రజకుల వృత్తి చెరువును కట్లయ్య ఆ గ్రామ నాయకులతో కలసి పరిశీలించారు.

ఖరీఫ్ జోష్..

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- వర్షాలతో ఊపందుకున్న వరినాట్లు
- కొవ్వూరు డివిజన్‌లో 27,537 హెక్టార్లలో ఇప్పటికే పూర్తి
- సాధారణ సాగు విస్తీర్ణం 39,620 హెక్టార్లు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. కొన్నిచోట్ల వరినాట్లు, చెరువుల కింద ఆకుమడులు వేస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో కూరగాయల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇరవై రోజులుగా బోర్ల కింద రైతులు వరి నాట్లు వేస్తున్నారు. నాలుగు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో పాటు తాడిపూడి కాలువకు నీటిని విడుదల చేయడంతో వ్యవసాయ పనులు వేగం పుంజుకున్నాయి. వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో చెరువు ఆయకట్టు భూముల్లో రైతులు దంపాకు మడులు పోస్తున్నారు. నారు సిద్ధంగా ఉన్న రైతులు బెంగాలీ కూలీల సాయంతో నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడుతున్నందున పనులు వేగంగా జరుగుతున్నాయని రైతులు అంటున్నారు. వర్షాలకు ఉద్యాన పంటలు కూడా కోలుకొని పచ్చగా కళకళలాడుతున్నాయి.

27,537 హెక్టార్లలో వరి నాట్లు

కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 39,620 హెక్టార్లు. ఇందులో ఇప్పటి వరకూ 27,537 హెక్టార్ల విస్తీర్ణంలో వరినాట్లు వేశారు. వాతావరణం అనుకూలిస్తే ఆగస్టు మొదటి వారానికి వంద శాతం నాట్లు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. డివిజన్‌లో ఉండ్రాజవరం, నిడదవోలు, చాగల్లు, కొవ్వూరు, నల్లజర్ల మండలాల్లో 65 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. ఎరువులు, విత్తనాలను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల వద్ద వ్యవసాయశాఖ సిద్ధంగా ఉంచింది. ప్రైవేట్ డీలర్ల ద్వారా కూడా వాటిని విక్రయిస్తున్నారు. ముందుగా నాట్లు వేసిన రైతులు పైరుకు మొదటి దఫా ఎరువులు వేశారు.

డివిజన్‌లో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం, ఇప్పటి వరకూ వేసిన నాట్ల వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	వేసిన నాట్లు (హెక్టార్లలో)
దేవరపల్లి	3718	1300
గోపాలపురం	4137	1001
నల్లజర్ల	4295	2200
ఉండ్రాజవరం	4995	4700
తాళ్లపూడి	3832	2262
పెరవలి	3335	2500
నిడదవోలు	7235	6500
చాగల్లు	3484	3050
కొవ్వూరు	4589	4024
మొత్తం	39,620	27,537

కూరగాయల పంట సాగు

ఖరీఫ్‌లో కూరగాయల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. వంగ, బెండ, టమోటా, మిర్చి, సొరకాయ, దోసకాయ వంటి పంటలను సాగు చేస్తున్నారు. అవసరమైన విత్తనాలను రైతులు ఏపీ సీడ్స్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఏటా డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 3,200 హెక్టార్ల విస్తీర్ణంలో కూరగాయల సాగు చేస్తారు.

861 మిల్లీ మీటర్ల వర్షపాతం

మూడు రోజులుగా కొవ్వూరు డివిజన్‌లో 861 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ నెల 12న 293, 13న 247, 14న 321 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 13వ తేదీ రాత్రి ఎడతెరిపి లేకుండా కుండ పోత వర్షం కురిసింది. మండలాలవారీగా తాళ్లపూడిలో అత్యధిక వర్షపాతం 54.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, దేవరపల్లిలో 50.2, గోపాలపురంలో 49.0, నల్లజర్లలో 48.6, నిడదవోలులో 40.0 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.



నారుమడి నుంచి వరి ఆకు తీస్తున్న కూలీలు



దేవరపల్లి మండలం త్యాజంపూడిలో వరినాట్లు వేస్తున్న కూలీలు



పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

ముమ్మరంగా వరినాట్లు



కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో పది రోజులగా వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. డివిజన్‌లో వరిసాగు సాధారణ విస్తీర్ణం 39,620 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 27,537 హెక్టార్లలో (65 శాతం) నాట్లు వేశారు. వాతావరణం అనుకూలిస్తే ఆగస్టు మొదటి వారం నాటిని నూరు నాట్లు శాతం పూర్తవుతాయి. డివిజన్‌లో 1764 హెక్టార్లలో నారుమడులు వేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సొసైటీలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయి.

– చంద్రశేఖర్, సహాయ సంచాలకుడు, వ్యవసాయ శాఖ, కొవ్వూరు

హెల్త్ క్లినిక్ వద్ద పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న మునిపల్లి సర్పంచ్ నరేష్, కార్యదర్శి మారుతీశ్వరరావు

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద నెలకొన్న అపరిశుభ్రతపై ఈనెల 17న 'సాక్షి'లో 'ఆరోగ్యం చెంతనే అపరిశుభ్రం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విలేజ్ క్లినిక్ చుట్టూ చేరిన బురద నీటిని, పెరిగిన పిచ్చి మొక్కలను బుధవారం జేసీబీ సాయంతో పూర్తిగా తొలగించారు. బ్లీచింగ్ చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. పారిశుధ్య పనులను మునిపల్లి పంచాయతీ సర్పంచ్ వెలగన నరేష్, కార్యదర్శి మారుతీశ్వరరావు పర్యవేక్షించారు. దీంతో ఆరోగ్య సిబ్బంది, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యకర జీవనంతో మానసిక సమస్యలకు చెక్

నల్లజర్ల: ఆరోగ్యకరమైన జీవన విధానం వల్ల మానసిక సమస్యలు కూడా నయమవుతాయని రాజమహేంద్రవరానికి ప్రముఖ న్యూరాలజిస్ట్ బలభద్ర వెంకట్రాజు అన్నారు. పీఎంపీ అసోసియేషన్ సభ్యులకు బుధవారం నల్లజర్ల ఏకేఆర్జీ ఫార్మసీ కళాశాలలో వివిధ అంశాలపై ఆయన శిక్షణ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీతారాముడు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రాజు మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చినపుడు తేలిగ్గా తీసుకొని గ్యాస్‌నొప్పిగా పరిగణించరాదన్నారు. ఇలా అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. సభాధ్యక్షుడు సీతారాముడు మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి సీజనల్ వ్యాధులపై సంఘ సభ్యులు గ్రామీణులను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం న్యూరాలజిస్ట్ బలభద్ర వెంకట్రాజును, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ బలభద్ర రఘువీర్‌ను, గుండె వైద్య నిపుణుడు వినోద్‌కుమార్‌లను అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎ.ధనుంజయ, దేవరపల్లి పీఎంపీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

కొవ్వూరు: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి ఒడ్డునే ఉన్న కొవ్వూరు మునిసిపాలిటీలో తాగునీటి సమస్య ఉండడం బాధాకరమన్నారు. తాను పట్టణంలో ఇంటింటికీ తిరిగినపుడు స్థానిక ఇందిరమ్మ, యనాద, అచ్చాయమ్మ కాలనీల వాసులు తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఈ పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే మూడు కాలనీలకూ తాగునీటి సమస్య తీరుతుందన్నారు. మున్సిపల్ సాధారణ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్టు కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి ప్రకటించారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కొవ్వూరులో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కుమారదేవంలో వన మహోత్సవం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కుమారదేవం గ్రామంలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వట్టికూటి వెంకటేశ్వరరావు, పెనుమాక జయరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మురుగు తొలగింపు పనుల పరిశీలన

తాళ్లపూడి: గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో ఇళ్ల వద్ద, రోడ్డు పక్కనే నిలిచిపోతున్న మురుగు నీటి తరలింపు పనులను ఆ పంచాయతీ బుధవారం చేపట్టింది. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పనులను కొవ్వూరు సబ్‌కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవ పరిశీలించారు. ఎంపీడీవో బి.వెంకటరమణ, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులతో ఆయన మాట్లాడారు. కాగా ఈ గ్రామంలోని మేదర పేటలో నిలిచిపోయిన వర్షపు నీటి తొలగింపునకు రెండు రోజుల క్రితం పంచాయతీ చేపట్టిన తాత్కాలిక పనులకు పొరుగునే ఉన్న వారు అభ్యంతరం చెప్పడమే గాకుండా, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టరు పి.ప్రశాంతి మంగళవారం వేగేశ్వరపురానికి వచ్చి, ఆ ప్రాంతాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. కలెక్టర్ సూచనల మేరకు బుధవారం జేసీబీ, కూలీల సాయంతో పంచాయతీ మురుగునీటి తొలగింపు పనులు చేపట్టగా, ఆ పనులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఎంపీడీవో బి.వెంకటరమణ మాట్లాడుతూ అత్యవసర, తాత్కాలిక పనులకు అడ్డంకి కల్పించవద్దని ఈ సందర్భంగా గ్రామస్తులను కోరారు.



వేగేశ్వరపురంలో పనులను పరిశీలిస్తున్న కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

12వ పీఆర్సీ విడుదల చేయాలి

- రిటైర్డ్ ఉద్యోగుల సంఘ జిల్లా సమావేశంలో అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ

తాళ్లపూడి: రిటైర్డ్ ఉద్యోగులు సంఘటితంగా ఉండాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక సమావేశాన్ని బుధవారం వేగేశ్వరపురంలోని ప్రభుత్వోన్నత పాఠశాల వద్ద నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, ఇతర అంశాలపై సమావేశంలో చర్చించారు. 12వ పీఆర్సీ త్వరగా మంజూరు చేయాలని ఈ సందర్భంగా సత్యనారాయణ డిమాండ్ చేశారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి బండి సూర్య ప్రకాష్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మారిశెట్టి సూర్యనారాయణ, వి.చంద్రయ్య, అన్ని మండలాల నుంచి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం నుంచి డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నుంచి డాక్టర్ విజయ, శ్రీ సాయిరామ్ డెంటల్ హాస్పిటల్ నుంచి డాక్టర్ శ్రీలేఖ, మోహన్ డయాబెటిక్ సెంటర్ నుంచి డాక్టర్ రమ్య తదితరులు ఉచితంగా 70 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.



వైద్య శిబిరంలో సేవలు పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

చెట్టు కొమ్మల నరికివేతపై విచారణ జరపండి

మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ఆదేశం

కొవ్వూరు: పవిత్రంగా భావించే స్థానిక గోష్పాద క్షేత్రంలోని 120 ఏళ్ల చరిత్ర గల భారీ రావి చెట్టు (దేవతా వృక్షం) కొమ్మల నరికివేతపై విచారణ జరిపించాలని మునిసిపల్ కమిషనర్ దానియేల్‌కు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి సూచించారు. మునిసిపల్ అధికారులతో కలసి బుధవారం ఆమె గోష్పాద క్షేత్రానికి వెళ్లి కొమ్మలు నరికివేసిన రావి వృక్షాన్ని, అక్కడే ఉన్న ఆ చెట్టు దుంగలను పరిశీలించారు. ఎవరి ప్రోద్బలంతో కొమ్మలు నరికివేశారో విచారించాలని ఆమె సూచించారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, కొండపల్లి రత్నసాయి పాల్గొన్నారు.



కొమ్మల నరికివేతపై గోష్పాద క్షేత్రంలో విచారిస్తున్న చైర్ పర్సన్ రత్నకుమారి (అంతర చిత్రం)



మోడువారిన దేవతా వృక్షం, దుంగలు

డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

నిడదవోలు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) వంద పడకల ఆసుపత్రిగా రూపుదిద్దుకుంటున్నందున ఇక్కడ డయాలసిస్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డయాలసిస్ అనేది చాలా ఖర్చుతో కూడిన వైద్యం కాబట్టి పేదలను దృష్టిలో పెట్టుకుని ఆ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కిడ్నీ సమస్యలతో బాధ పడుతున్న రోగులు రోజురోజుకూ పెరిగిపోతున్నారన్నారు. నియోజకవర్గంలోని పేదలు ప్రస్తుతం కిడ్నీ సమస్యలతో రాజమహేంద్రవరం, తణుకు, తాడేపల్లిగూడెం ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని రాంబాబు అన్నారు. దాతల తోడ్పాటుతో తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో డయాలసిస్ కేంద్రాలు నడుపుతూ రోగులకు ఉచితంగా, తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందిస్తున్నారని ఆయన చెప్పారు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ లాంటి దాతృత్వం కలిగిన సంస్థలు ముందుకు వచ్చి నిడదవోలు సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు.

వైష్ణవాలయాల్లో తొలి ఏకాదశి పూజలు



కొవ్వూరులోని సుందర గోవిందుడి ఆలయంలో సహస్ర విష్ణు పారాయణ చేస్తున్న భక్తులు



చాగల్లు సాయిబాబా ఆలయంలో భక్తుల హనుమాన్ చాలీసా పారాయణ



నల్లజర్ల మండలం అనంతపల్లిలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామి వారి హారతి తీసుకుంటున్న భక్తులు

- గోష్పాద క్షేత్రంలో సహస్ర విష్ణు పారాయణ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొవ్వూరు: తెలుగు వారి తొలి పండుగైన తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం స్థానిక గోష్పాద క్షేత్రంలో సహస్ర విష్ణు పారాయణ చేపట్టారు. దోర్బల అప్పల నరసింహమూర్తి ఆధ్వర్యంలో 24 గంటల పాటు ఈ పారాయణ జరుగుతుందని ఆలయ నిర్వాహకుడు పారుపూడి సుబ్రహ్మణ్యం తెలిపారు. దక్షిణాయనం ప్రారంభం సందర్భంగా విష్ణు పారాయణ ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన ఈ పారాయణ గురువారం ఉదయం ఆరు గంటల వరకూ కొనసాగుతుందని తెలిపారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: బుధవారం తొలి ఏకాదశి కావడంతో మండలంలోని వైష్ణవాలయాలను భారీగా భక్తులు దర్శించుకుని స్వామి వారి విశేష పూజలు చేశారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, కలవలపల్లి తదితర గ్రామాల ఆలయాలను ఉదయం నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చాగల్లులోని సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

నిడదవోలు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో తొలి ఏకాదశి (శయన ఏకాదశి) పూజల సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. లలితా పారాయణ అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, అర్చకుడు గోవర్ధనం దుర్గాప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పూజా గణపతి కుమారస్వామి వార్ల ఆలయంలోనూ ఏకాదశ పూజలు నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, అర్చకుడు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం ముత్యాలమ్మ వారికి శాకంబరీ అలంకారం



నిడదవోలులోని మదన గోపాల స్వామి

ఉండ్రాజవరం: మండలంలోని వైష్ణవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉండ్రాజవరం, పాలంగి, మోర్త, చివటం, కె.సావరం, సూర్యారావుపాలెం, వేలివెన్ను గ్రామాల రామాలయాలు, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేకువ జాము నుంచే పూజలు నిర్వహించారు. ఉండ్రాజవరంలోని భూ సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. వేలివెన్ను వేంకటేశ్వరస్వామి గుడిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

శాకంబరీ దేవిగా ముత్యాలమ్మ..

ఉండ్రాజవరంలోని ముత్యాలమ్మ వారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తుల సహకారంతో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించి, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నల్లజర్ల: అనంతపల్లిలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామి వారికి నూతన వస్త్రాలంకరణ, పుష్పలంకరణ చేసి, విశేషపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వివిధ భజనమండలుల ఆధ్వర్యంలో నవనీత హారతి, ఏకాహం జరిగాయి. విశేషంగా భక్తులు హాజరైనట్టు ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం సతీష్ తెలిపారు. కొనకళ్ల సత్యమోహన్ ఆధ్వర్యంలో భక్తిరంజని, విశేష అర్థాలతో భగవద్గీత పారాయణం జరిగాయి.

నిడదవోలు రూరల్: మునిపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పలు గ్రామాల్లోని శివాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. ఆలయ కమిటీల సభ్యులు కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.